## ముంపు ప్రాంతాలపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి



పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు రూరల్, జూన్ 1: ముంపు ప్రాంతాలపై అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. వర్షాకాలంలో విపత్తు నిర్వహణపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, వాటి ప్రస్తుత నీటి నిల్వ, పూర్తి నీటి నిల్వ సామర్థ్యం, కరకట్టల పరిస్థితి వివిధంగా ఉండేది ప్రాథమిక సర్వే నిర్వహించి పూర్తి వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా నీటిపారుదల శాఖ అధికారి అప్పలనాయుడు, ఈఈ నారాయణ, ఆకులవారి ఘనపురం డీఈ యశ్వంత్, భద్రాచలం డీఈ గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**పనులు సకాలంలో పూర్తి చేయాలి**

వెంకటాపూర్: అమ్మ ఆదర్శ పాఠశాల పనులు సకాలంలో పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. శనివారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జవహర్‌నగర్ కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలను పరిశీలించి మాట్లాడుతూ నాణ్యతతో రాజీ పడొద్దని, పాఠశాలల్లో చేస్తున్న పనులను రోజూ పర్యవేక్షించాలని ఏఈలు, మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, సమగ్ర శిక్ష ప్లానింగ్ కో ఆర్డినేటర్ అర్షం రాజు, ఇన్‌చార్జి ఎంఈవో సూర్యనారాయణ, ఏఈ పాల్గొన్నారు.

# తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

- కలెక్టర్ భవేశ్ మిశ్రా
- అంకుశాపురం శివారు రైస్ మిల్లు ఆకస్మిక తనిఖీ



తూకం వేసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

కాటారం, జూన్ 1: ధాన్యం తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ భవేశ్‌మిశ్రా హెచ్చరించారు. మండలంలోని అంకుశాపురం శివారులో అన్నపూర్ణ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తక్కువ తూకం వేస్తున్నారని దామెరకుంటకు చెందిన కొందరు రైతులు ఫిర్యాదు చేశారని, ఈమేరకు శనివారం తనిఖీ చేసినట్లు తెలిపారు. దిగుమతి చేసేందుకు లారీల్లో ఉన్న ధాన్యం బస్తాలను తీయించి రైతుల సమక్షంలో తూకం వేయించారు. తూకంలో ఎలాంటి వ్యత్యాసం లేదని గుర్తించినట్లు పేర్కొన్నారు. తూనికలు, కొలతలు శాఖ అధికారి, పౌరసరఫరాల శాఖ అధికారులు, సిబ్బంది తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పౌర సరఫరాల సంస్థ మేనేజర్ రాఘవేందర్, నర్సింగరావు, తూనికల కొలతల అధికారి శ్రీలత పాల్గొన్నారు.

**పాఠశాల పనులు పూర్తి చేయాలి**

మహదేవపూర్: పాఠశాలల పునఃప్రారంభంలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రా తెలిపారు. శనివారం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఎంపీడీఓతో కలిసి మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించి పాఠశాలల్లో మరమ్మతులు పూర్తిగానిని పరిశీలించారు. ఎలికేశ్వరంలోని ఎంపీపీఎస్‌లో 3.85 లక్షలు, మండల పరిషత్ పాఠశాలలో 3.94లక్షలతో చేపట్టిన మరమ్మతులు, బొమ్మాపూర్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో 4.55లక్షలతో చేపట్టిన మరమ్మతులను, మహదేవపూర్ కేజీబీవీలో 3.20లక్షలతో చేపట్టిన పనులను పరిశీలించారు. కేజీబీవీ ప్రహరీ గోడ నిర్మాణం ఆగస్టు 15 వరకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 20వ తేదీ వరకు ఆయా పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలన్నారు. మరమ్మతులకు అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు అందించాలన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో వీవోలతో సమీక్ష నిర్వహించారు. మండలంలో మొత్తం 26 ప్రభుత్వ పాఠశాలల్లో 3 జడ్పీహెచ్‌ఎస్, ఒక కేజీబీవీ ఉండగా 26 పాఠశాలల్లో కోటి 4లక్షలతో మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. పెండింగ్ పనులు వేగవంతం చేసి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. మహిళా సంఘాల ద్వారా కుట్టించిన స్కూల్ యూనిఫామ్స్ ధరించి చిన్నారులు కలెక్టర్‌కు పూలతో స్వాగతం పలికారు. డీఆర్‌డీవో నరేశ్, డీఈవో రాంకుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పీఆర్ డీఈ సాయిలు, ఏఈ రవీందర్, హెడ్‌మాస్టర్లు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

## ఇసుక మాఫియాను అరికట్టాలి

తాడ్వాయి, జూన్ 1: గోదావరి పరివాహక ప్రాంతంలో ఇసుక మాఫియాను అరికట్టాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి అత్యవసర సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గోదావరి పరివాహక ప్రాంతంలో షెడ్యూల్డ్ నిబంధనలను ఉల్లంఘించి వేలాది లారీల్లో ఇసుక తరలిస్తున్నారని తెలిపారు. ఏటూర్‌నాగారం, కిన్నెరసాని అభయారణ్యంలో జంతువులు సంచరిస్తాయని, రాత్రి వేళల్లో వాహనాలు తిరగరాదని నిబంధనలు ఉన్నా అటవీశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గోదావరి నదిలో అక్రమపట్టాలు చేసి అనుమతులు ఇచ్చిన రెవెన్యూ శాఖ, జియాలజీ, ఐటీడీఏ, పర్యావరణశాఖ అధికారులను కోర్టులకు ఈడుస్తామని హెచ్చరించారు. ఇసుక క్వారీలు మరో పదేళ్లు ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు అడుగంటి గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆదివాసీలు నీళ్లులేక అల్లాడిపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అభయారణ్యంలో రాత్రివేళల్లో వాహనాలు తిరగరాదని ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు వారికి ఆదాయమార్గంగా మారాయన్నారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, తుడుందెబ్బ నాయకులు గణేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ షెడ్యూల్

భూపాలపల్లి రూరల్, జూన్ 1: జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం షెడ్యూల్‌ను శనివారం విడుదల చేశారు. ఉదయం 8.40 గంటలకు ఎస్పీ కిరణ్ ఖరే, 8.42 గంటలకు కలెక్టర్ భవేశ్ మిశ్రా జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుని 8.45గంటలకు అమరవీరుల స్మారకం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు. అక్కడి నుంచి బయల్దేరి 8.47గంటలకు ఎస్పీ, కలెక్టర్ ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి 8.55 గంటలకు ఎస్పీ, 8.57 గంటలకు కలెక్టర్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని, 8.57 గంటలకు కలెక్టర్ గౌరవ వందనం స్వీకరిస్తారు. 9గంటలకు జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం ప్రసంగించనున్నారు.

## వెంకటాపురంలో రక్తదాన శిబిరం

వెంకటాపురం (నూగూరు), జూన్ 1 : చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 30మంది రక్తదానం చేశారు. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయిప్రకాశ్, విద్యుత్‌శాఖ ఏఈ సునీల్, డిప్యూటీ తహసీల్దార్ మహేందర్, గ్రామస్తులు ఆకుల గోపి, ఫరీద్ పాల్గొన్నారు.

## 'సమయపాలనలో అధికారుల అలసత్వం'

కన్నాయిగూడెం, జూన్ 1: మండల స్థాయి అధికారులు సమయపాలన పాటించడంలేదని ఎంపీపీ సమ్మక్క, కాంగ్రెస్ నాయకుడు రాంబాబు ఆరోపించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయానికి సర్టిఫికెట్స్ కోసం వెళ్లగా ఖాళీ కుర్చీలు కనిపించినట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలు దాటినా అధికారులు రాకపోవడంతో వెనుదిరిగినట్లు పేర్కొన్నారు. ఐదు నెలల క్రితం కార్యాలయాన్ని పరిశీలించిన ఎంపీపీ అధికారులను హెచ్చరించినా మార్పు రాలేదని పేర్కొన్నారు. కలెక్టర్, ఆర్డీవో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ సలీమ్‌ను వివరణ కోరగా ఏ టూర్‌నాగారం ఎస్టీవోలో బిల్లులు పెట్టేందుకు వెళ్లినట్లు తెలిపారు.

## కట్ట మైసమ్మ బోనాల జాతర ప్రారంభం



కట్ట మైసమ్మ తల్లి ఆలయం వద్ద వడ్డెలు, భక్తులు

వాజేడు, జూన్ 1 : మండలంలోని ప్రగళ్లపల్లి శివారు చెరువుకట్టపై స్వయం భు కట్టమైసమ్మ తల్లి బోనాల జాతర శుక్రవారం ప్రారంభమైంది. ఆలయ వడ్డె కలేటి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జాతరను మూడురోజులు నిర్వహిస్తారు. శనివారం పూసూరు గోదావరి నదికి గంగాస్నానం కోసం శివసత్తుల పూనకాలు, డప్పువాయిద్యాల నడుమ వెళ్లి వచ్చాక ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి నృత్యాలతో భక్తులు ఆలయం వద్ద సందడి చేశారు. ఆదివారం భక్తులు అమ్మవారికి చీర సారెతోపాటు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు.

## కలెక్టర్‌కు ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల వినతి

భూపాలపల్లి రూరల్, జూన్ 1: అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ భవేశ్‌మిశ్రాకు శనివారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేయకుండా ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. పర్మిషన్ లేకుండా నడుస్తున్న పాఠశాలలను తక్షణమే మూసివేయాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు, సంతోష్, రాము పాల్గొన్నారు.

## క్యారెట్‌తో తెలంగాణ అమరుల స్తూపం

కాటారం, జూన్ 1: కాటారం గిరిజన బాలుర గురుకుల కళాశాల చిత్రకళా ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ క్యారెట్‌తో తెలంగాణ అమరవీరుల స్థూపం రూపాన్ని తయారు చేశాడు. వెజిటేబుల్ కర్వింగ్ ఆర్ట్ ద్వారా సుమారు మూడు గంటల పాటు శ్రమించి 5.5 సెం.మీ ఎత్తు, 1.5 సెం టీమీటర్ల వెడల్పుతో చేశాడు. ఆయన్ను ప్రిన్సిపాల్ బుచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్, అధ్యాపకులలు అభినందించారు.



రజనీకాంత్



క్యారెట్‌తో అమరవీరుల స్తూపం ఆకారం

# మావోయిస్టుల ఆచూకీ సమాచారాన్ని తెలపండి

**మావోయిస్టుల పోస్టర్ విడుదల చేసిన ఎస్పీ కిరణ్ ఖరే**



మావోయిస్టుల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, జూన్ 1 : ప్రజలు నిర్భయంగా మావోయిస్టుల ఆచూకీ సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో కలిసి ఎస్పీ 10 మంది మావోయిస్టుల ఫొటోలతో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోస్టర్‌లో ఉన్న మావోయిస్టులపై రూ.65 లక్షల రివార్డు ఉందని, ప్రజలు వారి సమాచారాన్ని తమకు తెలియజేస్తే వారికి రివార్డు అందజేస్తామన్నారు. మావోయిస్టులకు సహకరించొద్దన్నారు. మావోయిస్టులు గ్రామాలకు వస్తే వారి సమాచారాన్ని భూపాలపల్లి ఎస్పీ 8712658103, భూపాలపల్లి డీఎస్పీ 871265 8103, కాటారం డీఎస్పీ 8712658104 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

**నూతన చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలి**

నూతన చట్టాలపై పోలీస్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. 1 జూలై నుంచి దేశ వ్యాప్తంగా నూతన చట్టాలు అమలు కానున్నందున శనివారం పోలీస్ అధికారులకు అవగాహన, శిక్షణ కార్యక్రమా లు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ దేశంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం 2023 చట్టాలు కొత్తగా అమలులోకి రానున్నట్లు తెలిపారు. మారిన చట్టాలకు అనుగుణంగా కేసులను నమోదు చేయాలని, నూతన చట్టాలపై పోలీస్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులు ఎలా స్వీకరించాలి? ఏయే సెక్షన్ కింద కేసులు నమోదు చేయాలి? స్టేషన్ బెయిల్‌కు ఎవరు అర్హులు? చార్జిషీట్ ఎలా తయారు చేయాలి? తదితర అంశాలపై కొత్త చట్టంలో మార్పులు చేర్పులు చేశారని వివరించారు. డీఎస్పీ నారాయణనాయక్, ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, వసంత్‌కుమార్, సీఐ నరేశ్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రత్నం, కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఫ్యాక్టరీ ఏర్పాటుతో పెరగనున్న ఆయిల్‌పామ్ సాగు





ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ స్థలాన్ని పరిశీలిస్తున్న సంజీవరావు

చిట్యాల, జూన్ 1 : ఫ్యాక్టరీ ఏర్పాటుతో జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు పెరగనున్నట్లు జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి సంజీవరావు తెలిపారు. శనివారం మండలంలోని నైన్‌పాక శివారులో సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఏర్పాటు చేస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ స్థలాన్ని పరిశీలించారు. ఫ్యాక్టరీకి కావాల్సిన సదుపాయాలు, బోర్లు, విద్యుత్ సరఫరా గురించి ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో రైతులు లాభాలు పొందవచ్చన్నారు. హార్టికల్చర్ డివిజనల్ అధికారి సునీల్, సువెన్ ఆయిల్ పామ్ ఇన్‌చార్జి గవాస్కర్, అరవింద్ పాల్గొన్నారు.

## 'దుర్భాషలాడినవారిపై చర్యలు తీసుకోవాలి'



ఐటీడీఏలో ఏపీవోకు సమస్యలను విన్నవిస్తున్న బృందం

ఏటూరునాగారం, జూన్ 1 : ఆదివాసీ మహిళను దుర్భాషలాడిన ఇద్దరు గిరిజనేతరులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్‌రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వనపాకల దిలీప్ కోరారు. మండల కేంద్రానికి చెందిన గిరిజన మహిళ ఈసం స్వరూపకు మొబైల్ టిఫిన్ సెంటర్ నడుపుకునేందుకు వ్యాన్‌ను ఐటీడీఏ ద్వారా అందించారు. ఆమె మండల కేంద్రంలోని వై జంక్షన్‌లో వ్యాన్ ద్వారా టిఫిన్ సెంటర్‌ను నడుపుకుంటుండగా కందుకూరి సుధాకర్, కందకట్ల శ్రీనువాస్ వచ్చి ఇక్కడ వ్యాన్ పెట్టొద్దని వాగ్వాదానికి దిగారు. దుర్భాషలాడి, బెదిరించారు. ఐటీడీఏ, రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో స్వరూప మానవ హక్కుల వేదికకు ఫిర్యాదు చేయడంతో నిజనిర్ధారణ కమిటీ శనివారం ఏటూరునాగారం సందర్శించి విచారణ చేశారు. ఐటీడీఏ ఏపీవో వసంతరావును కలిసి ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరారు. సుధాకర్, శ్రీనివాస్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యుడు కావిరి సంతోష్, బడే సులోచన ఉన్నారు.

# అవతరణ వేడుకలకు ముస్తాబు



విద్యుత్ కాంతుల్లో ములుగు కలెక్టరేట్

ములుగు రూరల్/గణపురం, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఎదుట జాతీయ జెండాను ఆయా శాఖల అధికారులు ఎగరవేయనున్నారు. ములుగు కలెక్టరేట్‌లో వేడుకల్లో ఉదయం 9గంటలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించనున్నారు. శనివారం రాత్రి కలెక్టరేట్ భవనాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గణపురం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఇతర కార్యాలయాలను ముస్తాబు చేశారు.

## వాహనాల తనిఖీ

వాజేడు, జూన్ 1 : మండలంలోని మండపాక వద్ద ఉన్న హైదరాబాద్ టు భూపాలపట్నం 163 జాతీయ రహదారిపై శనివారం వాజేడు ఎస్సై చవళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఇసుక లారీలతోపాటు ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలకు వచ్చిపోయే వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. ఇసుక లారీలను బరువుతోపాటు నకిలీ నంబర్ ప్లేట్లు అమర్చారా అనేది పరిశీలించారు.

## సింగరేణి కార్మికుడి మృతి



అశోక్(ఫైల్)

ములుగు రూరల్, జూన్ 1: గుండెపోటుతో సింగరేణి కార్మికుడు మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిసిన వివరాల ప్రకారం.. మద్ది అశోక్(40) కుటుంబ సభ్యులతో ములుగులో నివాసిస్తూ భూపాలపల్లి 8 ఇంక్లైన్‌లో సింగరేణి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఉదయం ఇంట్లో ఉన్న అశోక్ గుండెపోటు వస్తోందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## అనుమానాస్పద స్థితిలో ఒకరు ..

కాళేశ్వరం, జూన్ 1: మహదేవపూర్ మండలం మద్దులపల్లి అటవీ ప్రాంతంలో అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతి చెందారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం బోరంపల్లికి చెందిన ప్రవీణ్(27) అవసరాల కోసం మండలం మద్దులపల్లికి వస్తుండగా అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు తగిలాయా? లేక వడదెబ్బ తగిలి మృతిచెందాడా? అనేది తెలియాల్సి ఉంది. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై భవాని సేన్ తెలిపారు.

## రేపటి నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ములుగు రూరల్, జూన్ 1: ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో పాణిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 176 మంది విద్యార్థులు ఫెయిల్ కాగా వారందరికీ బండారుపల్లి మోడల్ పాఠశాలలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలు 13వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

## రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ములుగు రూరల్, జూన్ 1: మండలంలోని జాకారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో 3వ తేదీన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి పీ వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం ఇక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లోని బాలబాలికలకు పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 6, 7తేదీల్లో హనుమకొండలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9440440037ను సంప్రదించాలని సూచించారు.

## ఇసుక లారీలతో ట్రాఫిక్ జామ్

మంగపేట, జూన్ 1: మండలంలోని కమలాపురం - గంపోనిగూడెం మధ్య ఇసుక లారీలు నిలిచి శనివారం ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికంగా ఉన్న ఇసుక క్వారీల వద్దకు వచ్చి పోయే లారీలతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైపు నుంచి వచ్చే లారీలు మెయిన్ రోడ్డుపై పెద్ద సంఖ్యలో నిలిచాయి. సుమారు అరగంట పాటు ట్రాఫిక్ జామ్ కాగా ఆర్టీసీ బస్సులు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు, కార్లతోపాటు ఇతర వాహనాలు ఎక్కడిక్కడ నిలిచాయి.



ఇసుక లారీల కారణంగా జామ్ అయిన ట్రాఫిక్



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

## ఆంజనేయస్వామికి ఎమ్మెల్యే పూజలు

గణపురం, జూన్ 1: మండల కేంద్రంలోని గణపసముద్రం సరస్సు కట్టపై ఉన్న దక్షిణముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజమౌళి, ఉమారాణి దంపతులు మహా అన్నదానం చేశారు. తాజా మాజీ సర్పంచ్ నారగాని దేవేందర్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు చోటేమియా, నాయకులు వడ్లకొండ నారాయణగౌడ్, దూడపాక దుర్గయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బొడ్రాయి వద్ద గంగాభిషేకం చేస్తున్న భక్తులు

## బొడ్రాయి వార్షికోత్సవం

కన్నాయిగూడెం, జూన్ 1: మండలంలోని గూర్రేవులలో శనివారం బొడ్రాయి వార్షికోత్సవం గ్రామస్తులు నిర్వహించారు. గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలంతా బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు బోనాన్ని సమర్పించారు. ముందుగా బొడ్రాయి, గ్రామదేవతలకు గంగాభిషేకం చేసి ఉపవాస దీక్ష చేపట్టారు. గ్రామంలోని పూజారి నరేందర్, మహాలక్ష్మీ దంపతులు అమ్మవార్లకు వస్త్రాలను అందించారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

పలిమెల, జూన్ 1: నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి ముంజ మహేశ్ హెచ్చరించారు. శనివారం మండలంలోని సర్వాయిపేట, పంకెన గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో వ్యవసాయ, పోలీస్ అధికారులు తనిఖీలు చేపట్టారు. పత్తి విత్తనాలు స్టాక్ వివరాలను పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ బీజీ-11హెచ్‌టీ పత్తి విత్తనాలు జీఈఏసీ అనుమతి లేనందున, వీటిని కొనడం, అమ్మడం, సాగుచేయడం నేరమని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి పృథ్వీరాజ్, పోలీస్ కానిస్టేబుల్ భీమ్‌రావు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



కాళేశ్వరం : ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

వాజేడు/టేకుమట్ల/కాళేశ్వరం/వెంకటాపురం (నూగూరు)/ వెంకటాపూర్/గోవిందరావుపేట, జూన్ 1: హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఆలయాల్లో ఘనంగా జరిగాయి. వాజేడు మండలం అయ్యవారిపేటలో హనుమాన్ విగ్రహం వద్ద భక్తులు ఘనంగా పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. గ్రామస్తులు సంతోష్, మిరియాల రమణయ్య, నర్సింహచారి పాల్గొన్నారు. టేకుమట్లలోని భక్తాంజనేయస్వామి ఆలయం, ఇతర హనుమాన్ ఆలయాల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టేకుమట్ల భక్తాంజనేయ ఆలయ పూజారి వొల్లాల శ్రీనివాస్, వేద పండితులు సాంబమూర్తి పూలు, పండ్లు ఫలహారాలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. రావికంటి యాదగిరి, దాసరి రాజయ్య, కొయ్యల చిరంజీవి, రేణుకుంట్ల శ్రీధర్, వంగ నరేష్, ఎలవేణ రాజేందర్, మేకల సదయ్య, తిరుపతి, నిమ్మల స్వామి, బొల్లు సరోత్తంరెడ్డి, రావికంటి చంద్రమైళి, దక్షిణమూర్తి, తుమ్మల సాగర్, దాసరి సాయి శివ, స్వామి పాల్గొన్నారు. కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ ఆలయమైన కట్టమీద ఆంజనేయ స్వామి, గ్రామంలోని హనుమాన్ ఆలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి గోదావరి జలాలతో అభిషేకం, క్షీరాభిషేకం, చందనం పూజ, తమలపాకుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మాడుగుల బాపుశర్మ ఆధ్వర్యంలో చండీహోమం తర్వాత అన్నదానం నిర్వహించారు. వెంకటాపురం మండలంలో హనుమాన్ ఆలయాల్లో జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు వేల్పురి లక్ష్మినారాయణ, మండల అధికార ప్రతినిధి డర్రా దామోదర్, సీనియర్ నాయకులు జాగర శివాజీ, శాంతమూర్తియాదవ్ పాల్గొన్నారు. వెంకటాపూర్ మండలం పాలంపేటలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో జయంతి సందర్భంగా వేదపండితులు డింగరి పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో హోమాలు, పూజలు నిర్వహించారు. గోవిందరావుపేట మండలంలోని ఆలయాల్లో హనుమాన్ స్వాములు హోమం, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం చేశారు. స్వాములు మాలవిరమణకు సుమారు 200మంది ప్రైవేట్ వాహనాల్లో భద్రాచలం రాములవారి గుడికి తరలారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

**WANTED FEMALE TELECALLERS**

★Urgent Requirement for ICICI, HDFC Bank Personal Loans Fresher Female Tele-Callers, Vacancies: 40, Sal+Inc. etc.., Job Location: HNK, Cont: 8886188690.
NTW-5697

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

**HEALTH CARE**

★ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరమగు 24 గం॥ల సేవలు అందించబడును. సంప్ర॥ 6281476205, 9440325526
KMM_11654

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618

WARANAGAL 9182777556 9182777557

JAYASHANKAR BHUPALPALLY - 9182777559

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777554

JANGAON - 9182777565